# ది క్విజ్ మాస్టర్



## బి. నాగకుమారి

ఆరోజు సాయంత్రం. వాన ఇంకా తగ్గలేదు. నేతిలో వేయించిన జీడిపప్పు తింటూ, నవల చదువుకొంటుండగా జ్యోతి దగ్గరికి శారదాంబగారు మళ్ళీ వచ్చింది.

"జ్యోతీ! ఆ వైట్ కాశ్మీర్ సిల్క్ చీర కట్టుకొని ఈ ముత్యాల సెట్టు పెట్టుకో"

"ఓహ్ టెర్రిఫిక్! ఆగు మమ్మీ! ఇక్కడ మాడు హీరో జైల్లో నుంచి తప్పించుకొని పారిపోయి..."

"మన ఇంటికి వస్తున్నాడు. లే"

"ఆ ఇదేం జోకు..."

"నేను జోక్స్ వేయడంలేదు. నిజమే చెబుతున్నాను. నీకీ రోజు పెళ్ళిచూపులు. నిన్ను చూసుకోవడానికి పెళ్ళివారొస్తున్నారు. ఆ అబ్బాయి అమెరికాలో.... అదేంటబ్బా... ఆ ఎమ్మెస్ చేస్తున్నాడంట. ఓ నెల క్రితం నీ టేబిల్ మీద నువ్వు చూసిన ఫొటో ఆ అబ్బాయిదే. నిన్ననే అమెరికా నుంచి ఇక్కడికి వచ్చాడంట. ఇక్కడ వాళ్ళ తల్లిదండ్రులు మెహిదీపట్నంలో ఉన్నారు. మన ఇంటికి ఈ రోజు వాళ్ళు కూడా వస్తున్నారు..."

"మమ్మీ!... తన జీవితమనే నవలలో జరుగుతూన్న ఈ సడెన్ సంఘటనకి ఆ అమ్మాయి ముందు అవాక్కయింది. తర్వాత ఆశ్చర్యపోయింది. ఆ తర్వాత సిగ్గుపడింది. అంతకు రెండుక్షణాల ముందుగా అడిగింది.

"నాకిపుడే పెళ్ళేమిటి!"

"ప్రతి ఆడపిల్ల ఎన్నేళ్ళ కడిగినా, మొదటిసారి ఇదే మాట అంటుంది. అయినా నీకు ఇరవై రెండేళ్ళు. ఈ ఎండాకాలంతో నీ ఎమ్మెస్సీ అయిపోతుంది. మీ నాన్నగారు ఇంకో నాలుగేళ్ళలో రిటైరవ్వబోతున్నారు. చెప్పు. ఇంకా ఎపుడు చేసుకొంటావ్?"

తలవంచుకుని గోళ్ళ రంగు వైపు చూడసాగింది. ఆమె నెమ్మదిగా వచ్చి జ్యోతి తలమీద చెయ్యివేసింది.

"అమ్మా! జ్యోతి! ఈ రోజు కాకపోయినా రేపైనా నీకు పెళ్ళి చేయాల్సిందేగా. నీకు ముందు చెప్పలేదని బాధపడ్తున్నావా? అనవసరంగా పెళ్ళి గొడవలు అవీ చెప్పి నీ చదువుని డిస్టర్బ్ చేయడం నాకిష్టం లేకపోయింది. మాకంటె నీ మేలుకోరేవారు ఎవ్వరుంటారమ్మా! మేం చెబుతున్నామని కాకుండా నీకై నీవుగా ఆలోచించుకో. తుది నిర్ణయం మాత్రం నీదే అవుతుంది. నీకిష్టం లేకుండా ఏదీ జరగదు" ఆర్ద్రంగా ఆ తల్లి కంఠం పలికింది.

కనిపించీ, కనిపించకుండా అల్లరిచేసే జ్యోతి, ఆ క్షణంలో మూగదయ్యింది. చివరికి "మీ ఇష్టం మమ్మీ" అంది.

*   *   *   *

రాత్రి తొమ్మిది గంటలకు, జ్యోతి తన గదిలో ఒంటరిగా కూర్చుని ఆలోచించసాగింది. ఆమెకు నెమ్మది, నెమ్మదిగా ఒక్కో సంఘటనా గుర్తుకు రాసాగింది. ఆల్బమ్‌లో నుంచి తను షిఫాన్ చీర కట్టుకుని దిగిన ఫొటో మాయమవ్వటం, ఓ పదిహేను రోజుల తర్వాత ఒక అబ్బాయి ఫొటో తన రీడింగ్ టేబిల్ మీద కనబడడం, అమ్మా, నాన్నా ఈ మధ్య ఎక్కువగా మాట్లాడుకోవడం దగ్గర్నుంచీ ప్రొద్దున తనని బ్యూటీ పార్లర్‌కు వెళ్ళమనటం వరకు... ఏదో 'విదేశీ హస్తం' ఉన్నట్లుగా కనిపిస్తుంది. విదేశీ హస్తం... ఆ మాట దగ్గర ఆ అమ్మాయి ఆలోచన ఆగిపోయింది. ఆమె పెదవులు విచ్చుకున్నాయి. ఆమె అద్దంలో చూసుకోకపోవడం వల్ల తెలియలేదుగానీ... ఆ అమ్మాయి చెంపలు కూడా ఎర్రబడ్డాయి.

అతి మామూలుగా, తండ్రి స్నేహితుల్ని పరిచయం చేసినట్లే వారిని కూడా పరిచయం చేశారు. ఎక్కడా ఆచారాల తెరలు కనబడలేదు. తను కాలేజీలో క్లాస్‌మేట్స్‌తో ఎంతో మంది అబ్బాయిలతో అతి సాధారణంగా తలఎత్తి మాట్లాడేది. ఈ 'అబ్బాయి' ముందు... తను ఎందుకలా అయిపోయింది. ఏదో సిగ్గుగా, కుతూహలంగా, రవ్వంత భయంగా... ఇంకా ఏదోగా అయిపోయింది. ఆ 'ఏదో'... ఏమిటబ్బా... 'ఎల్...ఓ ... వి... ఈ" రేడియోలో ఏదో పాట. "గట్టిగా పెట్టినట్టున్నాడు ఈ వెధవ" తమ్ముణ్ణి మనస్సులో తిట్టుకుంది.

చాలాసేపటివరకూ నిద్రపట్టలేదు. ఫోన్ మ్రోగింది. బద్ధకంగా వెళ్ళి తీసి "హలో ... జ్యోతి స్పీకింగ్" అంది.

"నవీన్ హియర్..."

ఒక్కక్షణం ఉక్కిరిబిక్కిరయింది. ఆమె అలా అవుతుందనీ అతనికి తెల్సు. అందుకే రెండు క్షణాలాగాడు.

"డాడీని పిలుస్తాను. ప్లీజ్ బి ఆన్ ది లైన్"

"ప్లీజ్ బి ఆన్ దిలైన్... నేను మీతో మాట్లాడాలి"

జారిపోబోతున్న రిసీవర్‌ను గట్టిగా రెండుచేతులతో పట్టుకుంది.

"వింటున్నారా" "యస్"

"మీరు నాకు నచ్చారు. నేను మీకు నచ్చానా?"

మౌత్‌పీస్‌ని గట్టిగా పట్టుకొంది.

"ఆలోచించుకోవడానికి టైమ్ కావాలా?"

"అరె చెప్పండి. పబ్లిక్ బూత్ నుంచి మాట్లాడ్తున్నాను. కాబట్టి మీరు టైమ్ వేస్ట్ చెయ్యొద్దు. మీకు టైమ్ కావాలంటే చెప్పండి. నేను ఫోన్ పెట్టేస్తాను"

"అక్కర్లేదు"

"గుడ్. అయితే చెప్పండి"

"మీరు... మీరు మా డాడీని అడగండి"

"నేను మీ డాడితో మీ అమ్మాయి నాకు నచ్చింది అని చెప్పబోతున్నాను. దానికి ముందుగా మీరు... నేను నచ్చానని చెబితే"

ఇవతల్నుంచి సమాధానం వెళ్ళలేదు.

"నేను పది లెక్కపెట్టేలోగా మీరు చెప్పేయ్యాలి. లేకపోతే నేను ఫోన్ పెట్టేస్తాను. కానీ నేను మీ డాడితో మాట్లాడేది మాత్రం... మీరు 'ఎస్' అన్న తర్వాతే... వన్... టూ... త్రీ... ఫోర్... ఫైవ్... సిక్స్... సెవెన్... ఎయిట్... నైన్"

"ట్వెంటీ ఫైవ్, ఫైవ్... నైన్‌టీన్" గబగబా అనేసి ఫోన్ పెట్టిన శబ్దం విన్పించింది.

అతనికి అయిదు నిముషాల తర్వాత అర్థమైంది.

ఒక అరగంట తర్వాత వియ్యంకులిద్దరూ మాట్లాడుకొన్నారు. ఆదివారం నాడు 'తాంబూలాలు' పుచ్చుకోవాలని నిర్ణయించుకున్నారు.

*   *   *   *

మరుసటి రోజు, జ్యోతి

కాలేజి ఆవరణలో అడుగుపెట్టి, అత్యంతాశ్చర్యంలో మునిగిపోయింది. కారణం. పార్క్ చేసిన రాజ్‌దూత్ స్కూటర్‌కి ఆనుకుని నిలబడ్డ నవీన్. మనోహరంగా నవ్వి, "గుడ్‌మార్నింగ్" అన్నాడు.

నెమ్మదిగా తేరుకుని చిర్నవ్వు నవ్వింది.

"అలా బయటికెళ్దాం" స్కూటర్ని సమీపించిన జ్యోతిని అడిగాడు.

పబ్లిక్ గార్డెన్‌లో... ఏదో మాట్లాడ్తూ, ఎందుకో జ్యోతి చేతి వ్రేళ్ళను పట్టుకుని, "అబ్బ! నీవేళ్ళు చాలా పొడుగు కదూ. నా గెస్ నువ్వు మంచి ఆర్టిస్టు వయ్యుండాలి. జ్యోతి ముఖంలో ఉద్వేగం కొట్టొచ్చినట్లు కన్పిస్తోంది.

"నాకు... నాకు క్లాసులున్నాయి..." వినీ వినిపించనంత నెమ్మదిగా చెప్పింది.

"సరే! అయితే ఇక్కడే నిలబడి మాట్లాడుకుందాం"

"ఇక్కడా..." ఆమె చుట్టూ చూసింది. రెండేళ్ళ నుంచి ఎంతో పరువుగా, మర్యాదగా ఉంటున్న ప్రదేశం. ప్రొఫెసర్లెవ్వరయినా చూస్తే... హమ్మో!



"అహ వద్దు బయటికెళదాం" తొందరగా అనేసి నాలుక కరుచుకుంది.

"దట్స్ గుడ్. రండి" స్కూటర్ స్టార్ట్ చేశాడు. మళ్ళీ ఇంకోసారి చుట్టూ చూసి స్కూటర్ ఎక్కింది.

స్కూటర్ నెమ్మదిగా నడుపుతూ అడిగాడు.

"డిగ్రీ ఏ కాలేజీలో చదివారు?" చెప్పింది.

అలా నెమ్మదిగా ఒక్కో ప్రశ్న వేస్తూ ఆమెలో కొద్దిగా బిడియాన్ని తొలగించాడు. స్కూటర్ ఓ హోటల్ ముందు పార్క్ చేసి ఇద్దరూ లోపలికి ప్రవేశించారు. కూర్చున్న తర్వాత ఆమె ముఖంలోకి చూస్తూ అడిగాడు "రాత్రి మీరు నా గురించి ఏమనుకొన్నారు. ఐ మీన్ మీ నిర్ణయం... సరియైనదని మీరను కొంటున్నారా?"

జ్యోతికిపుడు చాలా ఇబ్బందిగా ఉంది. ఇందాకట్నుంచయితే ఎదురెదురుగా కూర్చోలేదు. కానీ ఇప్పుడు ముఖాముఖిగా మాట్లాడాలంటే... ఆమె ఏమీ సమాధానమివ్వలేదు. నవ్వింది.

"ఓకే. మీరు తీసుకున్న ఆ నిర్ణయం సరియైనదని, మీరు జీవితంలో ప్రతిక్షణం 'ఫీల్' అయ్యేలా నేనుంటాను. సరేనా?"

నెమ్మదిగా, స్థిరంగా జ్యోతికి మాత్రమే వినిపించేలా చెప్పాడు.

హఠాత్తుగా తలెత్తి జ్యోతి అతని ముఖంలోకి చూసిన ఆ చూపుని బహుశా అతను తన జీవితకాలంలో మర్చిపోలేకపోవచ్చు. 'థాంక్యూ', నెమ్మదిగా గొణిగింది. మూడు నిముషాల నిశ్శబ్దం తర్వాత నవీన్ అడిగాడు.

"ఏమిటి ఈ అబ్బాయి ధైర్యం. మరీ సిగ్గులేని వాడిలా ఉన్నాడు రాత్రి అలా ఫోన్ చేశాడు. ఇపుడిలా వచ్చి గొడవ చేస్తున్నాడు అనుకుంటున్నారు కదూ!"

"అహ లేదండి"

"దట్స్ గుడ్. మనం హనీమూన్‌కి 'ప్యారిస్' వెళదాం"

ఆమె సిగ్గుపడింది.

"ప్రపంచంలో చాలా అందమైన ప్రదేశమది. అన్నట్లు ప్రపంచంలో ఏడు వింతలు, ఆగకుండా చెప్పండి చూద్దాం"

"వేలాడే తోటలు, డయానా దేవాలయం, జూపిటర్ విగ్రహం, ఈజిప్టులోని పిరమిడ్లు, ఇంకా..." ఒక్క నిముషమాగింది

"ఉహు లాభంలేదు. నే చెబుతాను. మాసోలియమ్ ఆఫ్ మాసోలస్, లైట్‌హౌస్, రోడిస్‌లోని సూర్య విగ్రహం" నవ్వాడతను.

"ఊ పోనీ, ప్రముఖ సినీ నటుడు అమితాబ్‌బచ్చన్ యొక్క జబ్బు పేరేంటి?" అడిగాడతను.

"అదీ.. గుర్తు చేసుకోవడానికి ప్రయత్నించసాగింది. "మయా స్థేనియా గ్రేవిస్" అతను నవ్వి చెప్పాడు. "ఒక వ్యక్తి ఇద్దరుగా కనిపించడం, ఆహారం నమలలేకపోవడం, సాయంకాలానికి మరీ నీరసంగా తయారవడం ఈ వ్యాధి లక్షణాలు"

వెయిటర్ మూడోసారి వచ్చాడక్కడికి. ఇంక లాభంలేదనుకొని నవీన్ 'మెనూ' కార్డుతీసి "దో హనీమూన్ ఐస్‌క్రీమ్స్ ... ఇంకా ఏం తీసుకుందాం" అడిగాడామెను.

"అవి చాలు" వెయిటర్ వెళ్ళిపోయాడు.

అతను మాట్లాడ్తుంటే ఆమె వింటూ, అతను

అడుగుతూంటే ఆమె పెబస్తా అరగంట గడిపేసి బయటికొచ్చారు.

*    *    *    *

రోజూ అతను కాలేజికొచ్చేవాడు. అలా నాలుగురోజులు గడిచిపోయాయి. అయిదోరోజు, "లాండ్ స్కేప్" గార్డెన్‌లో నడుస్తూ నవీన్ అన్నాడు. "జ్యోతీ! నువ్వు హైహీల్స్ కొనుక్కోకూడదూ" చాలా యధాలాపంగా అన్నాడు.

ఆ మరుసటిరోజు, స్నేహితురాళ్లంతా గొడవ చేశారు.

"కాలేజికి రావడంలేదు. ఇంటికి ఫోన్ చేస్తే లేవని రిప్లై... అయినా స్కూటర్ మీద ఎవ్వరితోనో కన్పించావని కొంతమంది అంటున్నారు. ఏమిటి కథ చెప్పి తీరాల్సిందే" అన్నారు. జ్యోతి నవ్వేసి అంతా చెప్పింది.

ఆమె హీల్స్ చూసి "ఇవి కూడా తనే కొనుక్కోమని... ఆర్డరిచ్చాడా" సాగదీసింది ఓ భామ. తలవూపింది జ్యోతి.

"మైగాడ్. నీ ఎత్తు అయిదడుగులా ఆరంగుళాలు. ఇంకో మూడంగుళాల ఎత్తున్న చెప్పులు కొనుక్కోవడానికి అతను చెబితే మాత్రం నీకు బుద్ధుండక్కర్లా!" అడిగింది.

జ్యోతి మౌనంగా నవ్వింది.

"ఏయ్! నువ్వు మా మధ్య నిలబడితే మేమంతా లిల్లీపుట్స్‌లా ఉన్నాం తెల్సా!" ఓ అయిదడుగుల అతివ బాధపడింది.

ఇంతలో వారు కూర్చున్న లాన్ ముందు స్కూటర్ వచ్చి ఆగింది. జ్యోతి నవ్వి అతన్ని విష్ చేసి, అక్కడున్న నలుగుర్నీ పరిచయం చేసి, "హి ఈజ్ నవీన్. మై వుడ్..." ఆగిపోయింది.

అందరూ సన్నగా నవ్వేశారు.

"ఓకె. షల్ వి గో" మర్యాదగా అడిగాడతను.

స్కూటర్ స్టార్టయ్యింది.

పబ్లిక్ గార్డెన్‌లో... ఏదో మాట్లాడ్తూ, ఎందుకో జ్యోతి చేతివ్రేళ్ళను పట్టుకుని, "అబ్బ! నీ వేళ్ళు చాలా పొడుగుకదూ. నా గెస్ తప్పు కాకపోతే నువ్వు మంచి ఆర్టిస్టువయ్యుండాలి. జ్యోతి ముఖంలో ఉద్వేగం కొట్టొచ్చినట్లు కన్పిస్తుంది. అతను ఆమె చేతిని వదిలేశాడు.

"పోనీ, వీణ వాయిస్తారా!"

"అహ రాదండి..." ముఖానికి పట్టిన చిరుచెమటని అద్దుకుంటూ చెప్పింది.

"అయితే తప్పకుండా నువ్వు బొమ్మలు బాగా వేస్తావన్నమాట"

"అహా! రికార్డు వెయ్యటానికే నా ఆర్టిస్టిక్ ప్రతిభని సాగదీయలేక సంవత్సరం పొడవునా చచ్చిపోతుంటాను" నవ్వి చెప్పింది.

"ఈజిట్" అతనూ శృతి కలిపాడు.

"ఓకే ప్రపంచంలో కల్లా అత్యంత తెలివైన వ్యక్తి ఎవరు?" అడిగాడు.

"లియోనార్డో డావిన్సి. అతను బహుముఖ ప్రజ్ఞాశాలి. పెయింటర్, శిల్పి, ఇంజనీర్, శాస్త్రవేత్త ఇంకా... మంచి ఆర్కిటెక్ట్"

"అచ్చా. నీకో సంగతి తెల్సా జ్యోతి! వెస్టర్న్ కంట్రీస్‌లో అమ్మాయిలు చాలా కాన్ఫిడెంట్‌గా ఉంటారు. కానీ మన కంట్రీలో అంతా నెగిటివ్ ఎప్రోచ్. ఏదైనా సరే ముందు 'నో' అంటూ, చిన్న చిన్న విషయాల్ని కూడా భూతద్దాల్లో కాదు కాదు ఎలక్ట్రాన్ మైక్రోస్కోప్‌ల్లో చూసి భయపడ్తారు. దేన్నీ సరిగ్గా అర్థం చేసుకోరు. అందుకే మన కంట్రీ ఇలా వెనుకబడింది" అన్నాడతను.

తలా, తోకా లేకపోయినా ఈ మాటలు జ్యోతి బాగానే అర్థమయ్యాయి.

"మీకు... మీకు కోపమొచ్చిందా" అంది అతని కుడిచేతిపై తన చేతి వ్రేళ్ళతో నెమ్మదిగా తడ్తూ. అతను ఆమె ముఖంలోకి చూశాడు. అందమైన కళ్ళల్లో సన్నని నీటిపొర.

"నో... నో...జ్యోతీ! ఊరికే అలా చెప్పాను అంతే" నవ్వేస్తూ అన్నాడతను. చెక్కిళ్ళ మీదకి కన్నీరు జారకుండా ఉండడానికి విశ్వప్రయత్నం చేస్తుంది.

"ఏయ్ అంత చిన్నదానికి భయపడడం ప్లస్ బాధపడడం రెండూ తప్పే. ఐలవ్‌యూ. రియల్లీ జ్యోతీ. నవ్వు... ప్లీజ్"


ఆమె నవ్వింది.

"థాంక్‌యూ వెరీమచ్" ఆమె అరచేతిని చిన్నగా నొక్కి చెప్పాడతను.

"ఓకె. ఇంక వెళ్దాం. ఇంతటితో మా ప్రసారాలు సమాప్తం. మళ్లీ రేపు సాయంకాలం కలుద్దాం. జైహింద్" అన్నాడు.

జ్యోతి నవ్వకుండా, అతనివైపే చూడసాగింది.

"జైహింద్' అన్న పదాన్ని మొట్ట మొదటగా ఎవరు చెప్పారు" ఆమెను 'మూడ్'లోకి రప్పించడానికి అడిగాడు.






సంజాయిషీ

"ఏమిటండీ... ఇలా మీరు తప్ప తాగడం నోకేం నచ్చడం లేదు!" గట్టిగా దబాయించింది భార్య వెంకట్‌ను.

"ముగ్గురు స్నేహితుల్ని తీసికొని బార్‌కు వెళ్ళాను. వాళ్ళు ముగ్గురూ తాగరు! అందువల్ల ఆర్డర్ ఇచ్చిందంతా... నేను ఒక్కడ్నే తాగవలసి వచ్చింది డియర్!" సంజాయిషీ చెప్పుకొన్నాడు వెంకట్.

—గురు

జ్యోతి పరధ్యానంగా "జగదీశ్ చంద్రబోస్" అని చెప్పింది. నవీన్ నడుస్తున్నవాడల్లా ఆగి మరీ మరీ నవ్వసాగాడు.

"మొత్తానికి సైన్స్ స్టూడెంట్ నన్పించుకున్నావ్ ఆ పదాన్ని సుభాష్ చంద్రబోస్ చెప్పాడు" అన్నాడు నవ్వాపి.

*    *    *    *    *

ఆ రోజు సాయంకాలం. దీప జ్యోతి వాళ్ళింటికి వచ్చింది. దీప జ్యోతికి బెస్ట్ ఫ్రెండ్. కాసేపు మాట్లాడిన తర్వాత జ్యోతి అంది.

"దీపా! అతను 'ఐలవ్యూ' అని ఎన్నిసార్లన్నా నాకెందుకో అపనమ్మకంగా ఉంటుంది. భయం కూడా వేస్తుంది"

"అయితే అతను నిన్ను ప్రేమించడం లేదంటావా!"

"ప్రేమించడానికా నాలో ఏ ప్రత్యేకత ఉంది" అమాయకంగా అడిగింది.

"చూడు డియర్. ఇలా ప్రత్యేకతలు చూసుకుంటూ పోతే... అది ప్రేమెలా అవుతుంది"

"ఎందుకో నాకతని ముందు చాలా ఇన్ఫీరియర్‌గా అన్పిస్తుంది. ఇదంతా కలలా, ఎపుడు కరిగిపోతుందా అన్నట్లుగా ఉంటుంది"

"డోంట్ బి సిల్లీ! నీలో బోలెడన్ని ప్రత్యేకతలున్నాయి. చూడు ఈ అమాయకత్వం, ముగ్ధత్వం, పవిత్రత... ఇది మెయిన్. నీకు అనుమానం రావచ్చు. అక్కడ అంతమంది అమ్మాయిలుండగా... నన్ను ప్రేమించడానికి కారణం ఏమిటని. భర్తగా ప్రతీ అబ్బాయి కోరుకునే పవిత్రత నీలో ఉంది. అందుకే అతను నిన్ను..."

"ఏమో దీపా! అతను లేకుండా నేను బతకలేనన్పిస్తోంది"

"షేమ్. షేమ్. ఒక్కవారంలో ఏమయ్యింది నీకు ఇంత సిల్లీగా బిహేవ్ చేస్తున్నావ్"

"నాకూ అదే అర్థం కావట్లేదు"



• అలుపు

''నాది ''టూటయిర్'' (రెండు అంచెల) మినిస్ట్రీ'' అంటూ చెప్పిన ముఖ్యమంత్రిగారి ప్రకటనను ఓ వార్తాపత్రిక విలేకరి ''వారిది టూటయిర్డ్ (బాగా అలసిపోయిన) మినిస్ట్రీ'' అంటూ సందేశాన్ని పంపాడు. అలాగే ప్రచురింపబడింది ఆ పత్రికలో—

—గురు

''ఓ అలవా! నీ మనసు అంతగా పారేసుకున్నావా! మా జ్యోతి ఇంత వీక్‌గా, ఫికెల్ మైండెడ్‌గా ఎప్పట్నుంచి ఆలోచిస్తుందబ్బా!'' దీప పరిహాసం చేసింది.

''నువ్వో ప్రేమలో పడ్తే ఇంతకన్నా సిల్లీగా బిహేవ్ చేస్తావ్'' ఉక్రోషంగా అంది జ్యోతి.

''నేనస్సలు ప్రేమలో పడను'' దీప అంది.

''నేనూ అలాగే అనుకున్నాను... బట్''

''ఇపుడు ప్రేమలో పడ్డావన్నమాట''

''ఆహా మళ్ళీ లేవలేనంతగా...'' జ్యోతి సిగ్గుపడింది.

''అతనిలో ఏం ప్రత్యేకతలు చూసి ప్రేమిస్తున్నావ్!'' దీప అడిగింది.

''అతన్ని చూసిన క్షణం నుంచే అతన్ని ప్రేమిస్తున్నాను. లవ్ ఎట్ ఫస్ట్ సైట్. అతనిలో ఏ ప్రత్యేకతలు లేకపోయినా ఫర్వాలేదు. కానీ అతను నాక్కావాలి. ఐ వాంట్ హిమ్'' నెయిల్ పెయింట్ వైపు చూస్తూ చెప్పింది.

''మైడియర్ జ్యోతీ! అతనూ నీలాగే ఆలోచిస్తున్నాడేమో! ఫారెన్‌లో ఉంటున్నాడు కాబట్టి కొద్దిగా.. అల్లరిగా బిహేవ్ చేసుండొచ్చు. అయినా, క్వొశ్చన్ పేపర్ ఎగ్జామ్ హాలులో కాకుండా బయట తెలిస్తే ఆ ఎగ్జామ్ అదో థ్రిల్లింగ్‌గా ఉంటుంది. అలాగే, శోభనం గదిలో కాకుండా...''

''యూ సిల్లీ...'' జ్యోతి సున్నితంగా తిట్టింది.

* * * * *

మరసటిరోజు, ''మనమిరోజు ఉస్మానియా మెడికల్ కాలేజీకి వెళ్దాం. నా సర్టిఫికెట్లవీ తెచ్చుకోవాలి'' అని జ్యోతిని, నవీన్, మెడికల్ కాలేజీకి తీసుకెళ్ళాడు.

ఘ్యూఆర్ పార్క్ చేసి, ''నువ్విక్కడే ఉండు, నేను ఫైవ్ మినిట్స్‌లో వస్తాను'' అని లోపలికెళ్ళాడు.

అయిదు నిముషాల తర్వాత లోపల్నుంచి సంభాషణ వినిపించసాగింది. ''ఊ నవీన్! మీ ఫుడ్‌బి నిన్నేలా భరిస్తారో పాపం!'' ఎవ్వరిదో గొంతు.

''ఎందుకు నీకా డౌట్?'' నవీన్ గొంతు.

''చదువుకునే రోజుల్లో నీకో నిక్‌నేమ్ ఉండేది. గుర్తుందా— 'క్విజ్‌మాస్టర్'! ఎపుడూ ఏదో ఒక ప్రశ్నతో ఎదుటివార్ని విసిగిస్తుండేవాడివి. అవటానికి మెడికల్ స్టూడెంట్‌వయినా, 'ఫారడే సూత్రాల' దగ్గర్నుంచి 'షెన్నీ' దాకా, సిల్క్‌స్మిత డ్యాన్స్ దగ్గర్నుంచి సర్దార్ వల్లభాయ్ పటేల్ దాకా... అన్ని విషయాలు ఆల్‌రౌండర్‌లా మాట్లాడేవాడివి. ఇపుడా అలవాటు మారిందా లేకపోతే మీ ఆవిడకి అంతా ఫార్వెడ్ నాలెడ్జినా'' ఇద్దరూ నవ్వేశారు.

''కమాన్! బయట జ్యోతి వెయిట్ చేస్తుంది''

నవీన్, జ్యోతికి ఆ వ్యక్తిని తన చిన్ననాటి స్నేహితుడిగా పరిచయం చేసింతర్వాత, ఆ వ్యక్తి వీడ్కోలు తీసుకున్నాడు.

తర్వాత వాళ్ళిద్దరూ కల్సి 'కామత్' కెళ్లారు. 'కాఫీ'కి ఆర్డరిచ్చింతర్వాత.

''నా అడ్రస్ వ్రాసిస్తాను. పెన్ ఇవ్వు'' అన్నాడు. అడ్రస్ వ్రాసింతర్వాత.

''నేను రేపు వెళ్ళిపోతున్నాను కదా! నువ్వు ఉత్తరాల్ను వ్రాస్తుండాలి. ఓ.కె'' పెన్ను మూత పెట్టి అడిగాడు.

ఆమె తల ఊపింది.

ఇంతలో కాఫీ వచ్చింది. కాఫీ త్రాగి, బిల్ పే చేసి, 'దిల్షాద్'కి వెళ్ళారు. అడ్వర్టయిజుమెంట్లు వస్తున్నాయి. ఏదో పెన్సిల్ అడ్వర్‌టైజ్‌మెంట్ వస్తుంది ''అరె నీ పెన్ను నా దగ్గరే ఉండిపోయింది.'' అన్నాడతను.

''నా గుర్తుగా మీ దగ్గర దాన్ని ఉండనివ్వండి''

''ఓ.కె రేపు నేను ఏరోప్లేన్‌లో వెళ్ళేటపుడు, ఈ పెన్‌లో ఇంక్ పారబొయ్యమంటారు. ఎందుకో తెల్సా?''

జ్యోతికర్థంకాలేదు. ''ఎందుకు'' అని అప్రయత్నంగా అడిగింది. ''ఎందుకంటే, మనం ప్లేన్‌లో పైకెళ్తున్నప్పుడు అక్కడ గాలివత్తిడి తక్కువవుతుంది. కాబట్టి ప్లేన్‌లో ఉన్న గాలిపరిమాణం ఎక్కువవుతుంది. తత్ఫలితంగా ఇంక్ బయటనెట్టివేయబడి, బట్టలు పాడవుతాయి''

అతను ఇంకేదో చెబుతాడని చూసిన ఆమెకు నిరాశ కలిగింది. స్క్రీన్‌వైపు చూడసాగింది. ఏదో డిటర్జెంట్ సబ్బు కోసం... అడ్వర్టయిజ్ చేస్తున్నారు తర్వాత...

'బూస్ట్' అడ్వర్టయిజ్‌మెంట్ చుక్... చుక్... పిల్లలంతా రైలాట ఆడుతున్నారు.

''ఓకె జ్యోతీ! ఇది నేనడిగే లాస్ట్ క్వొశ్చన్ కాబట్టి నువ్వు ఆన్సర్ చెయ్యలేకపోతే నన్ను ముద్దుపెట్టుకోవాలి. నువ్వు ఆన్సర్ చెబితే నేను నిన్ను ముద్దుపెట్టుకుంటాను. చాలా ఈజీ క్వొశ్చన్ అడుగుతాను. ఎందుకంటే దేంట్లో అయినా 'లేడీస్ ఫస్ట్' ఉండాలని నా అభిప్రాయం...'' అతను నవ్వాడు.

వద్దంటే అతడికోపమొస్తుందేమోనని జ్యోతి ఏమన్లేదు.

''బి రెడీ. చైన్ లాగినపుడు ట్రైయిన్ ఎందుకాగిపోతుంది''

''ఎందుకు... ఎందుకంటే ఆమెకు సమాధానం చెప్పాలో, వద్దో అర్థం కావట్లేదు. ఎగ్జామ్ హాలు బయట క్వొశ్చన్ పేపర్... గుర్తొస్తుంది.

''మనం చెయిన్ లాగినపుడు ఒక విధమైన వాక్యూమ్ ఏర్పడి, అది ట్రైన్ ముందుకు కదలకుండా చేస్తుంది'' జ్యోతి వింటూనే ఉంది ఇంకా, లైట్లు తీసెయ్యడం నవీన్ ఆమె చెక్కిలి మీద ముద్దుపెట్టుకోవడం ఒక్కసారే జరిగాయి.

మార్నింగ్ షో కాబట్టి, పాత సినిమా కాబట్టి, వచ్చి చాలా రోజులయ్యింది కాబట్టీ, బాల్కనీ టికెట్ కాబట్టీ జనం అంతగాలేరు.

* * * * *

నవీన్ అమెరికా వెళ్ళిపోయాడు.

రెండు రోజులకోసారి ఆ ఇంటికొస్తున్న ఎయిర్‌మెయిల్‌ని చూసి పోస్ట్‌మాన్ కొద్దిగా ఆశ్చర్యపోయాడు. మూడ్రోజులకోసారి వస్తున్న ట్రంక్‌కాల్ గురించి తెలిస్తే పూర్తిగా ఆశ్చర్యపోయేవాడు లెండి.

ఆ రోజు ఏప్రిల్ 8. అదే దివ్య ముహూర్తంగా పురోహితులు నిర్ణయించడం చేత, మిస్ జ్యోతిని, మిసెస్ జ్యోతీ నవీన్‌గా మార్చే కార్యక్రమాన్ని చేపట్టారు పెద్దలు.

పెళ్ళి పీటల మీద గుసగుసగా అడిగాడు.

''జ్యోతీ! ఏప్రిల్ ఎనిమిది ప్రత్యేకత ఏమిటో తెల్సా!''

''మన పెళ్ళిరోజు''

''ఆహా 'వరల్డ్ హెల్త్‌డే' నవ్వాడతను.

నవీన్‌కి సెలవుల్లేకపోవడం చేత, జ్యోతి పాస్ట్‌పోర్ట్ సిద్ధంగా ఉండడం చేత, జ్యోతిని తొందరగానే అమెరికాకు పంపాల్సి వచ్చింది.

* * * *

అమెరికాలో, ఓ శుభోదయాన.

'జ్యోతీ'' వంటింట్లో పనిచేస్తున్న జ్యోతి పరిగెత్తుకు వచ్చింది.

''మొట్టమొదటి పానిపట్ యుద్ధం ఏ సంవత్సరంలో జరిగింది?'' అడిగాడతను — నవీన్.

ముందుకు పడిన జడ వెనక్కి వేసుకుంటూ జ్యోతి చెప్పింది. ''ఇవ్వాళ డేటెంత?''

''మే మూడు''

''మే మూడు పందొమ్మిది వందల ఎనభై నాలుగులో మొట్టమొదటి సంసార యుద్ధం మొదలవుతుంది...''

''వ్వాట్!''

''ఎస్. క్విజ్‌మాస్టర్! ఏ యుద్ధమెపుడు జరిగినా, ఎవ రెపుడు ఏ ఘనకార్యం చేసినా... మీరు నన్ను విసిగించడానికి వీల్లేదు. ఇక నుంచి మీ క్విజ్ కార్యక్రమం ఆపెయ్యండి. లేకపోతే నో ఫుడ్... నో బెడ్'' లోపలికెళ్తూ చెప్పింది మిసెస్ జ్యోతి.

ఈ జ్యోతి.. ఆ జ్యోతేనా... అని క్విజ్ మాస్టర్ ఆలోచనలో పడ్డాడు. పెళ్ళి తర్వాత అమ్మాయిలు మారిపోతారని, అధికారాన్ని తమ చేతుల్లోకి తీసుకుంటారని పాపం! ఆ ఆల్‌రౌండర్‌కి తెలీదు. అందుకే ఆశ్చర్యంగా చూస్తున్నాడు.